
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

గురువారం 6 నవంబరు 2025



# సాగునీటి వనరులకు జవసత్వాలు

**ఈ ఏడాది చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు రూ.77.11 కోట్లతో ప్రతిపాదనలు**

- గతేడాది రెండు విడతలుగా రూ.20.11 కోట్లతో పనులు
- గత వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి రంగం పూర్తిగా నిర్వీర్యం
- కూటమి ప్రభుత్వంలో పునరుజ్జీవం
- కలెక్టర్ చొరవతో చెక్‌డ్యామ్‌లు, మినీ రిజర్వాయర్ల మరమ్మతులకు మోక్షం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

**మన్యంలోని సాగునీటి వనరులకు జీవం పోసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఏజెన్సీలో 321 సాగునీటి వనరులకు మరమ్మతులు చేపట్టి 14 వేల 979 ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీరందించేందుకు ఈ ఏడాది ప్రతిపాదనలు చేశారు. ఏజెన్సీలోని చెక్‌డ్యామ్‌లు, మినీ రిజర్వాయర్లకు మరమ్మతులు చేపట్టేందుకు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని ఇప్పటికే రెండు విడతలుగా 136 వనరులకు మరమ్మతులు చేసేందుకు రూ.20 కోట్ల 11 లక్షలను మంజూరు చేశారు. తాజాగా రూ.77 కోట్ల 11 లక్షలతో మరికొన్నింటిని అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు.**



మరమ్మతులకు ప్రతిపాదించిన అనంతగిరి మండలంలోని ఓ చెక్‌డ్యామ్

సాగునీటి వనరుల మరమ్మతుల ప్రతిపాదనల వివరాలు

| మండలం | చెక్‌డ్యామ్‌లు | ఆయకట్టు (ఎకరాల్లో) | వ్యయం (రూ.లక్షల్లో) |
|---|---|---|---|
| 1. అనంతగిరి | 78 | 3,958 | 1,454.6 |
| 2. అరకులోయ | 16 | 828 | 671 |
| 3. డుంబ్రిగుడ | 25 | 1,150 | 667 |
| 4. హుకుంపేట | 16 | 1,135 | 238 |
| 5. పెదబయలు | 31 | 1,555 | 473 |
| 6. ముంచంగిపుట్టు | 12 | 402 | 178 |
| 7. పాడేరు | 23 | 675 | 333 |
| 8. చింతపల్లి | 25 | 1,245 | 720 |
| 9. జీకేవీధి | 20 | 1,268 | 1176 |
| 10. జి.మాడుగుల | 43 | 1,880 | 1,124 |
| 11. కొయ్యూరు | 22 | 883 | 678 |
| మొత్తం | 321 | 14,979 | 7711.6 |



మరమ్మతులకు నోచుకోని పాడేరు మండలం గొండెలి ప్రాంతంలోని చెక్‌డ్యామ్

గిరిజన ప్రాంతంలో సాగునీటి వనరులపై గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏజెన్సీలోని సాగునీటి రంగానికి ఒక్క రూపాయి కేటాయించకపోవడం గమనార్హం. ఏజెన్సీ పదకొండు మండలాల పరిధిలో 1,566 చిన్న తరహా సాగునీటి(చెక్ డ్యామ్‌లు) వనరులున్నాయి. వాటి పరిధిలో 66 వేల ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీరు అందుతున్నది. అయితే ఆయా సాగునీటి వనరులు ఏడాది విడిచి ఏడాదికోమారు మరమ్మతులకు గురవుతుంటాయి. ఫలితంగా సాగునీరు పంట పొలాలకు అందకుండా వృథాగా పోతుంటాయి. ఈ తరుణంలో ఆయా సాగునీటి వనరులకు అవసరమైన మరమ్మతులను చిన్నతరహా సాగునీటి పారుదల శాఖ అధికారులు చేపడతారు. కానీ వైసీపీ ప్రభుత్వం అందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేయకపోవడంతో ఏజెన్సీలో సగానికి పైగా సాగునీటి వనరులు ... మిగతా 8వ పేజీలో



## ఆలయాలకు కార్తీక పౌర్ణమి శోభ

సీలేరు శివాలయం ఆవరణలో దీపాలంకరణ చేస్తున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) సీలేరు శివాలయంలో విశేష అలంకరణలో స్వామివారు

జిల్లాలోని శివాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వేకువజాము నుంచే బారులుతీరారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ధ్వజస్తంభాల వద్ద దీపారాధనలు చేశారు. సీలేరులోని శివాలయం ఆవరణలో సాయంత్రం త్రిశూలం, స్వస్తిక్ ఆకృతుల్లో దీపాలను వెలిగించారు.

- సీలేరు/ఆంధ్రజ్యోతి

# 40 వేల హోమ్ స్టేల ఏర్పాటుకు ప్రణాళిక

**కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్**

పాడేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 40 వేల హోమ్ స్టేలను ఏర్పాటు చేసే విధంగా అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధిలో భాగంగా పర్యాటకుల్లో ఆసక్తి కలిగేలా హోమ్ స్టేలను అందుబాటులోకి తేవడానికి అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలోని అధికారులు, హోమ్ స్టే నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రకృతిని ఆనుకుని గిరిజనులు జీవించే విధానం విభిన్నంగా ఉంటుందని, దీనిపై పర్యాటకులకు ప్రత్యేక ఆసక్తి ఉంటుంది గనుక హోమ్ స్టేలకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్, పీఎం జుగా పథకం కింద జిల్లాలో 150కి పైగా హోమ్ స్టేలను ఏర్పాటు చేయడానికి అనుమతులు లభించాయని చెప్పారు. అరకు ప్రాంతాన్ని పర్యాటకంగా ప్రోత్సహించి, ఆ ప్రాంతాల గిరిజనులకు జీవనోపాధి కల్పించాలని ముఖ్యమంత్రి ఓ పాలసీని తీసుకురావడం గొప్ప విషయమని కొనియాడారు. అంతే కాకుండా 11 మండలాల్లో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, హోమ్ స్టేల ఏర్పాటుతో ఆర్థిక సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం పలు రాయితీలను అందిస్తోందన్నారు. స్వదేశీ, విదేశీ పర్యాటకులను ... మిగతా 8వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, (ఇన్‌సెట్‌లో) హాజరైన అధికారులు, హోమ్ స్టే నిర్వాహకులు

# గిరిజన జీవితాల్లో వెలుగులు

**స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలిసారి విద్యుత్ కాంతులు చూసిన గూడెం గ్రామస్థులు**

- కూటమి ప్రభుత్వం మేలు మరువలేమని ఆనందం

**అనంతగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):** స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా విద్యుత్ వెలుగులు ఎలా ఉంటాయో చూడని మండలంలోని రొంపల్లి పంచాయతీ మారుమూల గూడెం గ్రామస్థులు మంగళవారం రాత్రి ఇళ్లల్లో విద్యుత్ కాంతులను తొలిసారి చూశారు. ఈ గ్రామంలో 18 గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇప్పటి వరకు కాగడాల వెలుతురులోనే వీరు జీవనం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీరి సమస్యపై దృష్టి పెట్టింది. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు గత నెల 11న విద్యుత్ శాఖ ఎస్ఈ జీవన్ ప్రసాద్, డీఈఈ పి.వేణుగోపాల్, ఏడీ ఆనంద్‌మురళి ఈ గ్రామాన్ని సందర్శించారు. రూ.80 లక్షల వ్యయంతో తొమ్మిది కిలోమీటర్ల పొడవున 217 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఈ గ్రామంలోని ప్రతి ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. దీంతో ఆ గ్రామస్థుల ఆనందానికి అవధుల్లేకుండాపోయింది. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.



గిరిజనుడి ఇంట్లో విద్యుత్ వెలుగులు



కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న గూడెం గ్రామస్థులు

### సీఎం, డిప్యూటీ సీఎంలకు కృతజ్ఞతలు



మా గ్రామానికి విద్యుత్ సౌకర్యం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. కూటమి ప్రభుత్వం మా జీవితాల్లో వెలుగులు నింపింది. మాకు విద్యుత్ సౌకర్యం కల్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు.

- ఎస్.చిన్నారావు, గ్రామస్థుడు

### కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



చీకట్లో మగ్గుతున్న మా జీవితాల్లో వెలుగులు నింపిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. సాయంత్రం 6 గంటల తరువాత కాగడాలను పట్టుకుని బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు విద్యుత్ సౌకర్యం కల్పించి మా కుటుంబాలకు మేలు చేశారు.

- ఎస్.సింహాద్రి, గ్రామస్థుడు

# చింతపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కు

**15 ఎకరాల్లో ఓంశాంతి ఆధ్యాత్మిక పర్యాటకం**

- ఈఎంఆర్ పాఠశాల విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు
- డిసెంబరు నాటికి మ్యూజియం పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

చింతపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం వెనుక ఏపీఐఐసీ మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్ఎంఈ) ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తుందని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత రూ.78.3 లక్షల పీఎం జన్‌మన్ నిధులతో బెన్నవరం నుంచి బొంకమామిడి వరకు 1.5 కిలోమీటర్లు రహదారి నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వెనుకనున్న ఇండస్ట్రియల్ పార్కు, ఆధ్యాత్మిక పర్యాటకం నిర్మాణాలకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అలాగే చుంచుంపూడి గ్రామంలో ఉన్న ఈఎంఆర్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో బేస్‌లైన్ పరీక్షలు జరగలేదని విద్యార్థులు చెప్పారు. దీంతో వెంటనే గురుకులం ఓఎస్‌డీతో ఫోన్‌లో మాట్లాడి బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మడిగుంట గ్రామంలో పీఎం జన్‌మన్‌తో నిర్మించిన అంగన్‌వాడీ నూతన భవనాన్ని పరిశీలించారు. భవనానికి విద్యుత్ సదుపాయం కల్పించేందుకు నిధులు సరిపడకపోవడం వలన మండల పరిషత్ నుంచి రూ.50 వేలు సమకూర్చాలని ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మిని ఆదేశించారు. లంబసింగిలో నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. డిసెంబరు నాటికి మ్యూజియం పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్, గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్.. కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, పనులు పూర్తి చేస్తే బిల్లులు వెంటనే చెల్లిస్తామని ఆయన చెప్పారు. అనంతరం కలెక్టర్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లిలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వెనుకనున్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించామన్నారు. అలాగే ఇండస్ట్రియల్ పార్కు పక్కనే ఓంశాంతి నిర్వాహకులు ఆధ్యాత్మిక పర్యాటక ఉద్యానవనం ఏర్పాటు చేసేందుకు 15 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఆధ్యాత్మిక పర్యాటక ఉద్యానవనంలో ఆధ్యాత్మిక క్షేత్రం, మెడిటేషన్ కేంద్రం, స్కూల్, ఆస్పత్రి ... మిగతా 8వ పేజీలో



గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

# హుకుంపేట ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

**సమావేశానికి హాజరుకాని ఎంపీటీసీ సభ్యులు**

- అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనను రద్దు చేస్తున్నట్టు ఆర్డీవో వెల్లడి





ఖాళీగా ఉన్న హుకుంపేట ఎంపీటీసీ సభ్యుల కుర్చీలు (ఇన్‌సెట్‌లో) విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీవో లోకేశ్వరరావు

హుకుంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ కూడ రాజబాబుపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనను రద్దు చేసినట్టు ఆర్డీవో లోకేశ్వరరావు ప్రకటించారు. మండల పరిషత్‌లో 11 మంది సభ్యులున్నారు. వీరిలో బీజేపీ ఒకరు, టీడీపీ ఇద్దరు, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకరు, మిగిలిన ఎంపీటీసీ సభ్యులు వైసీపీ మద్దతుదారులున్నారు. వీరిలో ఇండిపెండెంట్ అభ్యర్థి ప్రియాంక కొద్దిరోజుల కిందట రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో అక్టోబరు 10వ తేదీన తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్‌కు స్థానిక ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో ఈ నెల 5న స్థానిక మండల పరిషత్ కార్యాయంలో నిర్వహించే ప్రత్యేక సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని సబ్ డివిజన్ మేజిస్ట్రేట్ నోటీసులు జారీ చేశారు. అయితే ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టలేదని ఆర్డీవో తెలిపారు. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ఒక్కసారి ప్రవేశ పెట్టడానికే వీలుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశానికి ఎంపీడీవో రమాదేవి, ఏవో సత్యనారాయణ, స్థానిక ఎస్ఐ సూర్యనారాయణ హాజరయ్యారు.



ముంచంగిపుట్టులో బుధవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో దట్టంగా కురుస్తున్న మంచు

## వణికిస్తున్న చలి

- ఉదయం 9 గంటలు దాటినా వీడని మంచు

ముంచంగిపుట్టు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. బుధవారం ఉదయం తొమ్మిది గంటలు దాటినా ముంచంగిపుట్టు లో మంచు వీడలేదు. రోజువారీ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు చలికి వణికిపోయారు. మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల్లో చలి మరికాస్త ఎక్కువగా ఉంది. ఇప్పుడే చలి తీవ్రత ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఏ స్థాయిలో ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా సమగ్రాభివృద్ధికి 'ప్రత్యేక అభివృద్ధి అథారిటీ' ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు సూచన
- జిల్లాల పునర్విభజనపై మంత్రులతో సమావేశంలో స్పష్టం చేసిన ముఖ్యమంత్రి




అల్లూరి సీతామరాజు జిల్లా కలెక్టరేట్

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం తాజాగా మరో అడుగు ముందుకేసింది. జిల్లా సమగ్రాభివృద్ధికి జిల్లా అభివృద్ధి అథారిటీ ఏర్పాటు చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం జిల్లాల పునర్విభజనపై మంత్రులతో అమరావతిలో నిర్వహించిన సమావేశంలో ఆయన సూచించారు.

**శత శాతం గిరిజనులున్న జిల్లాగా ప్రత్యేక గుర్తింపు**

జిల్లాలో ... మిగతా 8వ పేజీలో

## పాడేరు- భద్రాచలం ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

పాడేరురూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాడేరు నుంచి భద్రాచలానికి నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసు బుధవారం నుంచి పునరుద్ధరించినట్టు స్థానిక డిపో మేనేజర్ పసగాడ శ్రీనివాసరావు తెలిపారు. అలాగే, ఈ బస్సు వేళల్లో మార్పు చేసినట్టు వివరించారు. గతంలో ఈ సర్వీసు పాడేరులో సాయంత్రం 4 గంటలకు బయలుదేరేదని, ఇకపై మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి భద్రాచలానికి రాత్రి 11 గంటలకు చేరుతుందన్నారు. అలాగే, భద్రాచలంలో ఉదయం 7 గంటలకు బయలుదేరి సాయంత్రానికి పాడేరు చేరుకుంటుందన్నారు. ఈ సర్వీస్‌కు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించామని, ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.











పాడేరు గిరికైలాస మందిరంలో దీపారాధనలో మహిళలు


చింతపల్లి మండలం బొడ్డ శివాలయంలో ప్రత్యేక పూజలు

# ఘనంగా కార్తీక పౌర్ణమి

పాడేరురూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాడేరులో గిరి కైలాస క్షేత్రంగా పేరొందిన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకులు రామంపంతులు అభిషేకాలు, పూజలను నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. ప్రాంగణంలోని వివిధ దేవతామూర్తుల విగ్రహాలు, రావి, మర్రి, ఉసిరి, రుద్రాక్ష తదితర వృక్షాలకు భక్తులు భక్తి శ్రద్దలతో పూజలను చేపట్టారు.ఆలయ ఆధ్యాత్మిక ధర్మకర్త కొట్టగుళ్లి రమాదేవి ఆధ్వర్యంలో ఆలయ, ఆధ్యాత్మిక సేవా బృంద ప్రతినిధులు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు దాహార్తిని తీర్చేందుకు పాలు, మజ్జిగ అందించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని పూర్ణ పుష్కల అయ్యప్ప స్వామి ఆలయంలోని సోమనాథేశ్వస్వామిని వందలాది మంది భక్తులు దర్శించుకుని అభిషేకాలను చేపట్టారు.అనంతరం మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలో ఉన్న స్పటిక లింగేశ్వరస్వామి దర్శనానికి తరలివెళ్లారు. పాడేరులోనిలింగేశ్వరస్వామి, త్రిముఖ లింగేశ్వరి స్వామితోపాటు పలు శివాలయాలు భక్తులతో కళకళలాడాయి.

### ఉమానీలకంఠేశ్వరునికి జ్వాలా తోరణం

గిరికైలాస మందిర్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉమా నీలకంఠేశ్వస్వామి జ్వాలా తోరణ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి ఘనంగా చేపట్టారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం పట్టణ పురవీధుల్లో పల్లకిలో భారీ ఊరేగింపు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో దీపార్చన నిర్వహించారు. ఆధ్యాత్మిక సేవా ధర్మకర్త కొట్టగుళ్లి రమాదేవి ఆధ్వర్యంలో కె.సూర్యకుమారి భక్తులకు బూరెలు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రత్నం, కొట్టగుళ్లి రామారావు, వి.రాజబాబు, కొండలరావు, భక్తులు పాల్గొన్నారు.

### అన్న సమారాధన

పాడేరు మోదకొండమ్మ ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా హోమోజయ ఏకోపాసన మహాధర్మం స్వామీజీ ఆశీస్సులతో బుధవారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను స్థానిక తహసీల్దార్ డి.అరుణ్ చంద్ర ప్రారంభించారు. ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లో కోటిబాబు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాల్లో భద్రతా ఏర్పాట్లు పరిశీలన

కొయ్యూరు: కొయ్యూరు మల్లికార్జున స్వామి, వలసంపేట గిరిజా సమేత తాండవేశ్వరస్వామి ఆలయాలతోపాటు గాదిగుమ్మి జలపాతం వద్ద భద్రత ఏర్పాట్లను కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు ఎస్ఐ కిశోర్‌వర్మ పరిశీలించారు. భక్తుల రక్షణకు ఆలయ కమిటీలు చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. అనం తరం గాదిగుమ్మి జలపాతంను సందర్శించారు. ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు.

**గూడెంకొత్తవీధి:** ఆర్‌వీనగర్ శివాలయంలో ఆదివాసీ అర్చక సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులుకొర్ర బలరామ్, కృష్ణకుమారి దంపతుల సమక్షంలో గిరిజనఅర్చకులు వండ్రంగి సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు.

### బొడ్డ శివాలయంలో ప్రత్యేక పూజలు

చింతపల్లి: మండలంలోని బొడ్డ శివాలయంలో అర్చకులు కుంకుమార్చ, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జి.మాడుగుల, జీకేవీధి, చింతపల్లి, నర్సీపట్నం ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరుకావడంతో సాయంత్రం వరకు ఆలయం రద్దీగా కనిపించింది.


ఆర్‌వీనగర్ శివాలయంలో ప్రత్యేక పూజలు


భక్తులతో పాడేరు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో రద్దీ

## నేడు ఏపీఎఫ్‌డీసీ కాఫీ కార్మికుల బంద్

పాడేరురూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కోరు తూ పాడేరు డివిజన్ పరిధిలో ఏపీఎఫ్‌డీసీలో పరిధిలోని కాఫీ కార్మికులు గురువారం పనులు బంద్ చేస్తున్నట్టు కాఫీ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు లింగేటి సుందరరావు తెలిపారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 నవంబరులో జరిగిన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పనులను విరమించి డీఎం కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నయ్యపడాల్, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి జోలికి పోవద్దు: సీఐ

డుంబ్రిగుడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి జోలికి వెళ్లి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని అరకు సీఐ హిమగిరి అన్నారు. మండలంలోని కంద్రుం గ్రామంలో పరివర్తన కార్యక్రమం స్థానిక ఎస్ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, గంజాయి సాగుతోపాటు క్రయ, విక్రయాలు, రవాణా వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి జోలికి వెళ్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కిముడు హరి, వైస్ ఎంపీపీ ఆనంద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**చింతపల్లి:** గిరిజన యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ వి. వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం వారపు సంతలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఈ సందర్భంగా నిర్వహించి కళాజాత ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఐసీ డీ ఎస్ సూపర్‌వైజర్ దేహూరు జయభారతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ హిమగిరి

## అర్హులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు

చింతపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో అర్హులందరికీ ప్రధానమంత్రి ఉజ్జ్వల యోజన(పీఎంయూవై) ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేయనున్నట్టు స్థానిక జీసీసీ డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీఎం యూవై 3.0 పథకానికి దారిద్య్రరేఖకు దిగువనున్న ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ కులాలకు చెందిన ప్రజలందరూ అర్హులనేనన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ బ్రాంచి మేనేజర్ చల్లంగి సుగునాథం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీసీసీ డీఎం వెంకటేశ్

## జి. మాడుగులలో మద్యం షాపునకు రీ-నోటిఫికేషన్

పాడేరురూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జి.మాడుగుల మండలంలో మద్యం షాపు నిర్వాహణకు అధికారులు రీ-నోటిఫికేషన్ జారీ చేశారని జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్.గౌరీశ్వరరావు తెలిపారు. అభ్యర్థులు రూ. 2 లక్షలు నగదును చలానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించి వేలంలో పాల్గొవాలన్నారు. . ఆ సక్తిగలవారు ఈ నెల 10వ తేదీ సాయంత్రం లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు.


ఎక్సైజ్ అధికారి గౌరీశ్వరరావు







## హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో వెంకటరమణ

అరకులోయ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ వసతిగృహాల్లోని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అరకులోయ ఎటీడబ్ల్యూవో వెంకటరమణ సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ వసతిగృహాల హెచ్‌డబ్ల్యూవో, డిప్యూటీ వార్డెన్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్టల్ విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించాలన్నారు. ఇతరులతో విద్యార్థులను బయటకు పంపించకూడదన్నారు. మెనూ పక్కాగా అమలు చేయాలని కోరారు. వసతిగృహంలో స్టడీ హవర్ కు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో రెండు మండలాల హెచ్‌డబ్ల్యూవో, డిప్యూటీవార్డెన్లు హజరయ్యారు.

## కషాయం ఎరువులు మేలు

జి.మాడుగుల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సహసిద్ధ వనరులతో తయారు చేసిన కషాయం ఎరువులు వాడాలని ఎం.నిట్టాపుట్టు ప్రకృతి వ్య వసాయ యూనిటీ ఇన్‌చార్జి ఎం.ప్రసాదరావు సూచించారు. బుధవారం కోరాపల్లిలో రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చిన్నతల్లి, నాయకులు నానాజీ, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వలిసె పూల సోయగం


కుసుమవలసలో వలిసె పూలు

డుంబ్రిగుడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుసుమవలసలో జాతీయ రహదారిని ఆనుకుని వలిసె పూలు మైమరిపిస్తున్నాయి. కనుచూపు మేరలో పచ్చని రంగుతో ఆకర్షిస్తున్నాయి. వాహనచోదకులు, పర్యాటకులు వీటిని సెల్‌ఫోన్‌లలో బంధిస్తున్నారు.
























## ఘనంగా దుర్గాదేవి విగ్రహం ప్రతిష్ఠ


విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళుతున్న భక్తులు

జి.మాడుగుల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వంతాల గ్రామంలో బుధవారం దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకువెళ్లి వేదమంత్రాలతో విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వినాయక ఆలయానికి స్థలం కేటాయింపు


స్థలాన్ని ఆలయ నిర్మాణ కమిటీకు అప్పగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొయ్యూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చీడిపాలెం పంచాయతీ కాకరపాడులో వినాయక ఆలయాన్ని గతంలో తొలగించారు. ఈ నేపథ్యంలో ఆలయ పునః నిర్మాణానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. పోతవరం రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి రెండు సెంట్లు కేటాయించి ఆలయ నిర్మాణ కమిటీకు బుధవారంఅప్పగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు నౌంద్రు శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

## కల్వర్టుకు మరమ్మతులు చేపట్టండి

కొయ్యూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుపానులో దెబ్బతిన్న రహదారి కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని బకులూరుకు చెందిన రైతులు ఎంపీడీవో ప్రసాద్‌ను కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు బకులూరు పంచాయతీ పరిధి అంకంపాలెం, నెల్లిపూడి గ్రామాలకు చెందిన సుమారు పొలాలకు వెళ్లే రహదారితో పాటు కల్వర్టు ధ్వంసమైయ్యాయి. స్పందించిన ఎంపీడీవో ఉపాధి పథకంలో వీటి మరమ్మతులు చేపడుతామని హామీ ఇచ్చారు.

## రాష్ట్ర స్థాయి పరుగు పోటీలకు ఎంపిక

పెదబయలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పరుగు పోటీలకు స్థానిక గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పాతుని చంటిబాబు ఎంపికయ్యాడు. విశాఖలో ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా పోటీల్లో చంటిబాబు పాల్గొన్నారు. 800 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ డి.ఎస్. శంకరరావు తెలిపారు. విద్యార్థితోపాటు పీడీ గిరివరప్రసాద్, పీ ఈటీ డి. రాంబాబులను అభినందించారు.


చంటిబాబును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శంకరరావు,ఉపాధ్యాయులు















# ఈపీడీసీఎల్ పరిధిలో రూ.250 కోట్లతో 69 సబ్ స్టేషన్లు

- నాణ్యమైన విద్యుత్ పంపిణీయే ప్రభుత్వ లక్ష్యం
- విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్



అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం చౌడువాడలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్. చిత్రంలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే బండారు, కలెక్టర్ విజయకృష్ణన్, తదితరులు

అనకాపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలో గల 11 జిల్లాల్లో రూ.250 కోట్లతో 69 సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. బుధవారం ఆయన అనకాపల్లిలో రూ.5.5 కోట్లతో నిర్మించనున్న ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లాలోని కె.కోటపాడు మండలం చౌడువాడ, కింతలి గ్రామాల్లో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా చౌడువాడ గ్రామంలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం విధించిన ఎఫ్‌పీపీసీఏ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ ప్రైస్ అడ్జస్ట్‌మెంట్) చార్జీ (యూనిట్‌కు) 40 పైసల నుంచి 27 పైసలకు తగ్గించనున్నట్టు పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకొని ప్రయోజనం పొందాలన్నారు. అనకాపల్లి జిల్లాలో ఇప్పటివరకూ 20 వేల మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఇళ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, కలెక్టర్ విజయకృష్ణన్, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### ఈపీడీసీఎల్ సెక్షన్ కార్యాలయ భవనానికి శంకుస్థాపన

అనకాపల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నిదానందొడ్డిలో రూ.5.5 కోట్లతో నిర్మించనున్న ఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యాలయ ఆవరణలో భూమి పూజ చేసి శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్, కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, ఎస్ఈ జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

## నూకాంబిక సన్నిధిలో ప్రముఖులు



మంత్రి రవికుమార్‌ను సత్కరించిన అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల, తదితరులు

అనకాపల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారిని బుధవారం విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన మంత్రికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఆలయ ఛైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో కేఎల్ సుధారాణి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. బాలాలయంలో అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. మంత్రితో పాటు ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు కూడా అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు వీరిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రిని, ప్రజా ప్రతినిధులను ఆలయ ఛైర్మన్ పీలా నాగశ్రీను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## 40 వేల హోమ్ స్టేల ఏర్పాటుకు ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

ఆకర్షించేలా సిల్వర్, గోల్డ్ కేటగిరీలుగా విభజిస్తున్నామని చెప్పారు. పర్యాటకుల భద్రత విషయమై కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ మాట్లాడుతూ గిరిజన ఆచార, సంప్రదాయాలు ఉట్టిపడేలా హోమ్ స్టేలు ఉండాలని, గిరిజనుల ఆహారపు అలవాట్లు, జీవన విధానం తెలిసేలా ఉండాలని కోరారు. హోమ్ స్టే స్టేట్ నోడల్ అధికారి వై.ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ హోమ్ స్టేలకు సంబంధించి ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, సాంకేతిక సమస్యల పరిష్కారానికి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఓ బృందం పనిచేస్తుందని చెప్పారు.

## చింతపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేస్తారన్నారు. అలాగే పీఎం జన్‌మన్ పథకం ద్వారా నిర్మిస్తున్న భవనాలు, రహదారుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.శంకరరావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, పీఆర్ ప్రాజెక్టు డీఈఈ డి.సురేశ్ రెడ్డి, ఏఈఈ వి.వెంకటేశ్, పీఆర్ ఏఈఈ బాలకిశోర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ గడుతూరి స్వర్ణలత, టీడబ్ల్యూ డిఈఈ రాఘునాథరావునాయుడు, ఏఈఈ యాదకిశోర్, ఎస్ఎంఐ ఏఈఈ లోకేశ్, ఈఎంఆర్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



## నిండు చంద్రుడు ఒక వైపు..



పెదబయలు శివారు ఏకలవ్య స్కూల్ వద్ద ఇలా..

మన్యంలో ప్రస్తుతం ప్రకృతి అందాలు చూపరులను విశేషంగా కనువిందు చేస్తున్నాయి. పాడేరు నుంచి ముంచంగిపుట్టు వెళ్లే ప్రధాన మార్గంలో పెదబయలుకు సమీపంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చేరువలో కిందన పచ్చని వలిసె పూలు, నింగిలో నిండు చంద్రుడితో బుధవారం సాయంత్రం చూడచక్కని దృశ్యం ఆవిష్కృతమైంది. దానిని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది. - ఆంధ్రజ్యోతి/పాడేరు

# డీసీసీబీలో దందాపై ఆప్కాబ్ ఆరా

- పదోన్నతికి అన్ని అర్హతలున్నా డబ్బులు వసూలు
- మంత్రి సిఫారసు చేసిన ఉద్యోగి వద్ద కూడా...
- బ్యాంకులో అనధికార వ్యక్తి పెత్తనం
- ప్రాథమిక సహకార సంఘాల నుంచి కూడా నెలవారీ మామూళ్లు వసూళ్లకు ప్రయత్నం

విశాఖపట్నం/నర్సీపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల పదోన్నతుల వ్యవహారంలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అన్ని రకాలుగా అర్హతలున్న ఒక ఉద్యోగికి పదోన్నతి కల్పించాలని మంత్రి ఒకరు స్వయంగా ఫోన్ చేసి బ్యాంకు పాలకులకు చెప్పారు. అయితే మంత్రి సూచన పాటించామని చెబుతూనే పదోన్నతి పొందిన సదరు ఉద్యోగి నుంచి భారీగా సొమ్ములు వసూలు చేశారు. ఈ విషయం మంత్రికి తెలియడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారని తెలిసింది. అలాగే పదోన్నతి పొందిన ఒకరు అడిగినంత సొమ్ము ఇవ్వలేదని శివారు ప్రాంతంలోని బ్రాంచిలో పోస్టింగ్ ఇచ్చారనేది మరో ఆరోపణ. కాగా వాహన కంపెనీ షోరూమ్ ప్రతినిధి ఒకరు ప్రతిరోజు బ్యాంకుకు వచ్చి కీలక వ్యక్తి ఛాంబర్‌లో కూర్చుని పెత్తనం చలాయిస్తున్నారనే సిబ్బంది చెబుతున్నారు. ఆయన వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తంచేసినా పెద్దలు పట్టించుకోవడం లేదంటున్నారు. ఈ విషయమై ఇప్పటికే నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్టు తెలిసింది. ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో 98 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సదరు ప్రైవేటు వ్యక్తి ఫోన్ చేసి ప్రతినెలా కొంత మామూళ్ల కింద ఇవ్వాలని ఒత్తిడి తీసుకురావడంతో అనకాపల్లి జిల్లాలో పలు సొసైటీలకు చెందిన ఉద్యోగులు తమ పరిధిలో కూటమి ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారని తెలిసింది. సొసైటీలు నష్టాల్లో నడుస్తున్నాయని, ఇటువంటి తరుణంలో ఈ దందా ఏమిటని వాపోయినట్టు చెబుతున్నారు. డీసీసీబీలో పదోన్నతుల వ్యవహారంలో సొమ్ముల వసూళ్లపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం రావడంతో విజయవాడలోని ఆప్కాబ్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు.

ఎంతమందికి పదోన్నతి ఇచ్చారు?, వారిలో అనర్హులు ఉన్నారా?, పదోన్నతి పొందిన వారి నుంచి ఏ మేరకు వసూలు చేశారు?, పదోన్నతి పొందిన వారి వివరాలు పంపాలని బ్యాంకు ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఒకటి, రెండు రోజుల్లో ఆప్కాబ్ ప్రతినిధులు నగరంలోని డీసీసీబీని తనిఖీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

# ప్రజలకు మంచి చేయడంలోనే సంతృప్తి

- ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్
- గూడెం గ్రామంలో విద్యుత్ సౌకర్యం ప్రారంభం



గూడెం గ్రామంలో ఓ ఇంటి వద్ద స్విచ్ ఆన్ చేసి విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

అనంతగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా కన్నా ప్రజా అవసరాలను గుర్తించి, వారికి ఎంతవరకు మంచి చేశామన్నదే జీవితంలో సంతృప్తినిస్తుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ గూడెం గ్రామాన్ని బుధవారం స్థానిక జనసేన నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ముందుగా గిరిజనులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గూడెం గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా గిరిజనులు కాగడాల వెలుగులో గడపడంపై పవన్‌కల్యాణ్ చలించిపోయారన్నారు. ఈ క్రమంలోనే రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారని చెప్పారు. అనంతరం గిరిజనుల ఇళ్లకు వెళ్లి విద్యుత్ సరఫరాకు స్విచ్ ఆన్ చేశారు. గ్రామానికి 7 కిలోమీటర్ల పక్కా రోడ్డు, గ్రామంలో తాగునీటి పథకం, పాఠశాల, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం గురించి ఉపముఖ్యమంత్రికి వివరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గిరిజనులకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోని సర్పంచ్ చిరంజీవి, అరకు జనసేన పార్టీ ఇన్‌చార్జి శెట్టి చిరంజీవి, ఉమ్మడి జిల్లాల కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ ఇన్‌చార్జి డి.నవీన్‌కుమార్, మండల అధ్యక్షుడు సీహెచ్ మురళి, పి.లక్ష్మణ్, టీడీపీ మహిళ నాయకురాలు పి.నిర్మల, లక్ష్మి, విద్యుత్‌శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాతాశిశు మరణాలను అరికట్టాలి

- ఐటీడీఏ పీవో శ్రీపూజ



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ

పాడేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో మాతాశిశు మరణాలను అరికట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కృషి చేయాలని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ ఆదేశించారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షల సంఖ్య పెంచి, మరణాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని, పీహెచ్‌సీ పోర్టల్‌లో గర్భిణుల వివరాలను నమోదు చేయడమే కాకుండా గర్భధారణ ప్రారంభ దశలోనే గుర్తించి వైద్య సేవలు అందించాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, టీకాలను సక్రమంగా వేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108, 104 వాహనాలు సిద్ధంగా ఉండాలని, మలేరియా రహిత జిల్లా ధ్యేయంగా సిబ్బంది పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో కృష్ణమూర్తినాయక్, పీడీ ఝాన్సీ, జిల్లా మలేరియా అధికారి తులసి, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

... 5వ పేజీ తరువాయి

మొత్తం 22 మండలాలు ఉండగా, వాటిలో పాడేరు ఐటీడీఏ పరిధిలో 11, రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో 7, చింతూరు ఐటీడీఏ పరిధిలో 4 మండలాలున్నాయి. అలాగే మొత్తం 22 గిరిజన మండలాలు కావడంతో మూడు ఐటీడీఏల ద్వారా గిరిజనుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. అలాగే మూడు ఐటీడీఏలకు ఛైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తున్నారు. జిల్లాలో అనంతగిరి మండలంలోని నాలుగు పంచాయతీలు మినహా మొత్తం జిల్లా అంతా ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉంది. ఇప్పటికే గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

### కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా అభివృద్ధి అథారిటీ ఏర్పాటు

ఇప్పటికే పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల ద్వారా గిరిజనుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్న కూటమి ప్రభుత్వం.. దానిని మరింత వేగవంతం చేయడంతోపాటు ప్రత్యేక అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా అభివృద్ధి అథారిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. అయితే అథారిటీలో ఇంకా ఎవరెవరూ ఉంటారు, దాని విధి విధానాలు ఏమిటి అనేది రూపొందించాల్సి ఉంది. కలెక్టర్ ఛైర్మన్‌గా దానిని ఏర్పాటు చేస్తారని తెలిసింది. ఏదిఏమైనా గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

# సాగునీటి వనరులకు జవసత్వాలు

... 5వ పేజీ తరువాయి

మరమ్మతులకు గురయ్యాయి.

### గతంలో ఎమ్మెల్యేకు రూ.20 కోట్లు కేటాయించినా దక్కని ఫలితం

వైసీపీ ప్రభుత్వం ఒక అసెంబ్లీ స్థానం పరిధిలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.20 కోట్లు కేటాయించినా, వాటిలో సైతం సాగునీటి వనరుల మరమ్మతులకు ఒక్క రూపాయి వెచ్చించలేదు. నియోజకవర్గానికి కేటాయించిన మొత్తం నిధులను కేవలం మెటల్ రోడ్లు, సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు మాత్రమే కేటాయించారు. దీంతో గిరిజన రైతులు కేవలం వర్షాధారంగానే వ్యవసాయాన్ని చేయాల్సిన పరిస్థితి వైసీపీ హయాంలో కొనసాగింది.

### తాజా 321 వనరుల మరమ్మతులకు రూ.77 కోట్లతో ప్రతిపాదనలు

మన్యంలో ఈ ఏడాది 321 సాగునీటి వనరులకు మరమ్మతులు చేపట్టి, వాటి కింద ఉన్న 14 వేల 979 ఎకరాల్లోని ఆయకట్టుకు సాగునీటిని అందించాలని నిర్ణయించారు. అందుకు గాను రూ.77 కోట్ల 11 అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించి చిన్ననీటి పారుదల శాఖాధికారులు కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు ప్రతిపాదనలు సమర్పించారు.

### గతేడాది రెండు విడతల్లో రూ.20.11 కోట్లు మంజూరు

ఏజెన్సీలో సాగునీటి వనరులకు జీవం పోయాలనే ఆలోచనతో జాతీయ ఉపాధి పథకం ద్వారా ఏజెన్సీలోని 136 చెక్‌డ్యామ్‌లు/మినీ రిజర్వాయర్‌లకు మరమ్మతులు చేపట్టేందుకు కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ గతేడాది రెండు విడతలుగా రూ.20 కోట్ల 11 లక్షలు మంజూరు చేశారు. తొలి విడతలో రూ.12 కోట్ల వ్యయంతో 71 పనులు మంజూరు కాగా, రెండో విడతలో రూ.8 కోట్ల 11 లక్షలతో 65 పనులను మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన ప్రాంతంలో సాగునీటి వనరులకు మోక్షం కలగడంపై గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## క్రైం... crime news

### చికిత్స పొందుతూ ఒకరి మృతి



బిశ్వాస్ (ఫైల్ ఫొటో)

సబ్బవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సబ్బవరంలో గత నెల 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మంగళవారం రాత్రి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అసోం రాష్ట్రం డుంబ్రి జిల్లా హకామా గ్రామానికి చెందిన మింటూ బిశ్వాస్ గాలిభీమవరం శివారు పల్లవానిపాలెంలో ఎన్టీఆర్(పాత జగనన్న కాలనీ)లేఅవుట్‌లో గత కొంత కాలంగా ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్నాడు. గత నెల 31వ తేదీ రాత్రి సబ్బవరం వచ్చాడు. మూడు రోడ్ల కూడలి నుంచి సాయినగర్ కాలనీ వైపు నడిచి వెళుతున్నాడు. ఆ సమయంలో అనకాపల్లి వైపు నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో బిశ్వాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతనిని విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి బిరేన్ బిశ్వాస్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు.

### పేకాట శిబిరంపై దాడి.. తొమ్మిది మంది అరెస్టు

కొయ్యూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రివాడ పంచాయతీ దొడ్డవరంలో పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. జూదం ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని రూ.11,300 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు కొయ్యూరు ఎస్ఐ కిశోర్‌వర్మ చెప్పారు

### పులపర్తి గ్రామ సమీపంలో..

ఎలమంచిలి: మండలంలోని పులపర్తి గ్రామ సమీపంలో బుధవారం పేకాట శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రూ.5,380 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

### మంగవరం శివారులో..

పాయకరావుపేట రూరల్: మండలంలోని మంగవరం గ్రామ శివారులో బుధవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.5,940 నగదు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు.

## మత్స్యగుండం ఆలయ అభివృద్ధికి కృషి

- ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ



మత్స్యగుండం ఆలయంలో నందీశ్వరుని విగ్రహం వద్ద జ్యోతి వెలిగిస్తున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ. పక్కన మఠం పంచాయతీ సర్పంచ్ శాంతికుమారి

హుకుంపేట నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ప్రజల ఆరాధ్య దైవమైన మత్స్యగుండం మత్స్యలింగేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ తెలిపారు. బుధవారం ఆమె మఠం పంచాయతీ పరిధిలోని మత్స్యగుండాన్ని సందర్శించారు. అనంతరం మత్స్యలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆమెను సత్కరించి, ఆలయ చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కార్తీక మాసం, మహాశివరాత్రి పర్వదినాల్లో ఇక్కడకు అధిక సంఖ్యలో భక్తులు రావడానికి అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం దుస్తులు మార్చుకునేందుకు గదులు నిర్మిస్తామని చెప్పారు. ఆమె వెంట మఠం పంచాయతీ సర్పంచ్ శాంతికుమారి, ఆలయ కమిటీ సభ్యులు మత్స్య రాంబాబు, సింహాచలం, ఆనంద్, బాలయ్య, హరినాథ్, వెంకటప్రసాద్, సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ సూర్యనారాయణ వున్నారు.

## పెద్దేరు నుంచి 300 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుపాన్ వర్షాల ప్రభావం తగ్గి ఐదారు రోజులు అయినప్పటికీ పెద్దేరు జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతూనే వుంది. జలాశయం ఎగువ ప్రాంతం నుంచి 480 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా బుధవారం సాయంత్రానికి 135.7 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ప్రాజెక్టు అధికారులు ముందు జాగ్రత్త చర్యగా బుధవారం రాత్రి తొమ్మిది గంటలకు స్పిల్‌వేలో ఒక గేటు తెరిచి 300 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు.

## గిరిజనుల వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ ధర



కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ పల్పింగ్ ప్రారంభిస్తున్న జిల్లా ఏజీఎం గౌరీ శంకర్

చింతపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు ఎఫ్‌పీవో (రైతు ఉత్పత్తిదారుల సంఘం)ల ద్వారా అంతర్జాతీయ ధరలు అందిస్తున్నట్టు నాబార్డు జిల్లా ఏజీఎం గౌరీశంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పెంటపాడులో మాతోట ఎఫ్ పీవో నిర్మించిన కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌లో కాఫీ పల్పింగ్‌ని జిల్లా ఏజీఎం ప్రారంభించారు. అనంతరం ఎఫ్‌పీవో సీఈవోలు, బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో జిల్లా ఏజీఎం సమావేశమయ్యారు. గిరిజన రైతులకు నాబార్డు రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఎఫ్‌పీవోలు కాఫీకి మార్కెటింగ్ సదుపాయం కల్పించడం శుభపరిణామన్నారు. పసుపు, అల్లం, మిరియాలు పంటలకు సైతం మార్కెటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. మాతోట సీఈవో వనముల చిన్నారావు మాట్లాడుతూ ఎఫ్‌పీవో కాఫీ పండ్లకు మాతోట ఎఫ్‌పీవో ద్వారా కిలోకి రూ. 60 ధర అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన వికాస్ కార్యదర్శి నెల్లూరి వెంకట సత్యనారాయణ, ఎఫ్‌పీవో సీఈవోలు బాకాని లోవరాజు, మామిడి లోవరాజు, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఇంగవరామారావు, సాగిన మల్లుపడాల్ పాల్గొన్నారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 105.00 |
| లైవ్ ధర | 125.00 |
| విత్ స్కిన్ | 220.00 |
| స్కిన్ లెస్ | 230.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 575 |
| విజయనగరం | 579 |
| శ్రీకాకుళం | 579 |